నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
11 | హైదరాబాద్, సోమవారం 12 ఫిబ్రవరి 2024 | RANGAREDDY

# కొడంగల్‌లో మెడికల్ కాలేజీ

**జీవో విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం.. హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు**



కొడంగల్, ఫిబ్రవరి 11 : కొడంగల్‌కు ప్రభుత్వ మెడికల్ కళాశాలను మంజూరు చేస్తూ జీవో నం. 6ను సర్కార్ విడుదల చేసింది. ప్రభుత్వ మెడికల్ కళాశాలకు 50 సీట్లు, నర్సింగ్ కళాశాలకు 60 సీట్లు, ఫిజియోథెరఫీ కళాశాలకు 50సీట్లు కేటాయించడంతోపాటు కొడంగల్ సీహెచ్‌సీ ఆసుపత్రిని 50 పడకల నుంచి 220 పడకల ఆసుపత్రితో పాటు టీచింగ్ ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు జీవోలో పొందుపర్చింది. ఇందుకు 22,450కోట్లు నిధులు వెచ్చించనున్నటు జీవోలో తెలిపింది. మెడికల్ కళాశాల ఏర్పాటుపై నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొడంగల్ ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి సీఎం కావడంతో కొడంగల్ దిశ, దిశ మారుతుందని, ఇదివరకే కోస్గి మున్సిపల్‌లో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటైనట్లు అధికారులు తెలిపారు. కొడంగల్‌లో మెడికల్ కళాశాల ఏర్పాటుతో పాటు కొడంగల్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిని 220 పడకలుగా అప్‌గ్రేడ్ చేయడంతో పాటు మెరుగైన వైద్యం అందించేలా కృషి చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

## రైతులను కాంగ్రెస్ మోసం చేసింది..



బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు రంచన్‌గా పెట్టుబడి సాయమందేది. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టుబడి సాయం ఇవ్వక గోస పడాల్సి వస్తున్నది. అప్పుల కోసం మళ్లీ సావుకారుల దగ్గరకు పోవాల్సిన రోజులొచ్చినయ్. ఎన్నికల్లో గెలువడానికి ఇది చేస్తాం.. అది చేస్తామన్న కాంగ్రెస్ పార్టీ.. రైతులను మోసం చేసింది.

– నేనావత్ రాంచందర్, నుచ్చుగుట్టతండా, ఆమనగల్లు మున్సిపాలిటీ

## లాగోడికి రందీ పడుతున్నా..



గత ప్రభుత్వ హయాంలో సమయానికి రైతుబంధు పడేది. ఇప్పుడేమో యాసంగి లాగోడికి రందీ పడాల్సి వస్తున్నది. అప్పులు తెచ్చి సాగు చేస్తున్నాం. పెట్టుబడి లేక సాగు తగ్గించా. ఎన్నికలప్పుడు గెలువగానే కాంగ్రెస్ పార్టీ పెట్టుబడి సాయం ఇస్తమన్నది. కానీ ఇప్పటిదాక రాలె. నా లాంటి సన్న, చిన్న కారు రైతులకు మళ్లీ ఎనుకటి కష్టాలు మొదలైనట్లు అనిపిస్తున్నది. ఇప్పటికైనా ప్రభుత్వం పెట్టుబడి సాయమందించాలి.

– భిక్షపతి, శంకర్‌పల్లి



## లోక్‌సభ పోరుకు..

# కసరత్తు ముమ్మరం

- ప్రారంభమైన అధికారుల బదిలీల ప్రక్రియ
- జిల్లాలో 14 మంది ఎంపీడీవోల బదిలీ
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో కొనసాగుతున్న సమావేశాలు
- త్వరలో ఈవీఎంల పరిశీలన..

రంగారెడ్డి, ఫిబ్రవరి 11(నమస్తే తెలంగాణ) : లోక్‌సభ ఎన్నికల ఏర్పాట్లను అధికారులు ముమ్మరం చేశారు. ఇప్పటికే జిల్లా ఓటరు తుది జాబితాను ప్రకటించగా..అధికారుల బదిలీల ప్రక్రియ సైతం మొదలైనది. ఆదివారం జిల్లా వ్యాప్తంగా 14 మంది ఎంపీడీవోలు బదిలీ అయ్యారు. ఎన్నికల నిర్వహణలో కీలకపాత్ర పోషించే ఈవీఎంల పనితీరును పరిశీలించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. మరోపక్క రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు.

**14 మంది ఎంపీడీవోల బదిలీ..**

ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం అధికారుల బదిలీలను చేపడుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలో 2024 జనవరి 31 నాటికి మూడేండ్ల సర్వీసు పూర్తి చేసుకున్న రెవెన్యూ, పోలీసు, పంచాయతీ రాజ్ విభాగాల్లో బదిలీలు జరిగాయి. మరోవైపు సర్వీసుతో సంబంధం లేకుండా సొంత జిల్లాలో వివిధ ప్రభుత్వ విభాగాల్లో పనిచేస్తున్న అధికారులు సైతం బదిలీ అయ్యారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మరో దఫా బదిలీలు జరుగనున్నాయి. జూన్ నెల ప్రాతిపదికగా మూడేండ్ల సర్వీసు పూర్తి చేసుకున్న అధికారుల జాబితాను ఇప్పటికే జిల్లా ఉన్నతాధికారులు ఎన్నికల సంఘానికి పంపించారు. ఈ మేరకు ఆదివారం జిల్లాకు చెందిన 14 మంది ఎంపీడీవోల బదిలీలు జరిగాయి.

**విడుదలైన ఓటరు జాబితా..**

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈనెల 8న కలెక్టర్ ఓటరు తుది జాబితాను విడుదల చేశారు. జిల్లాలో 3,369 పోలింగ్ కేంద్రాలుండగా..వీటి సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. మరోపక్క వివిధ పార్టీల ప్రతినిధులతో సమావేశాలను నిర్వహిస్తున్నారు. త్వరలోనే ఈవీఎంల ఫస్ట్ లెవల్ చెక్ ప్రక్రియను చేపట్టనున్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మొదటి విడత తనిఖీ ప్రక్రియను చేపడతారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెల్లడైన 45 రోజుల్లోగా ఎలాంటి ఫిర్యాదులు రాకుంటే ఆ నియోజకవర్గంలో ఉపయోగించిన ఈవీఎంలనే లోక్ సభ ఎన్నికలకూ ఉపయోగిస్తారు. జిల్లాలో ఈ తరహా ఫిర్యాదుల లేకపోవడంతో శాసనసభ ఎన్నికల్లో ఉపయోగించి న ఈవీఎంలనే లోక్ సభ ఎన్నికల్లోనూ వినియోగించనున్నారు. షెడ్యూల్ విడుదలైన తర్వాత మరో దఫా నిర్వహించే ర్యాండమైజేషన్ ప్రక్రియలో ఎలాంటి లోపాలు లేని వాటిని గుర్తించి పోలింగ్ కేంద్రాలకు తరలిస్తారు.





**యాసంగిలో 4,04,436 మందికి రూ.378.92కోట్ల సాయం అందించాలని ప్రభుత్వ నిర్ణయం**

**ఇప్పటి వరకు కేవలం రూ.147.33 కోట్లు మాత్రమే రైతుల ఖాతాల్లో జమ**

**మూడు ఎకరాల్లోపు రైతులకే అందిన సాయం**

**పెట్టుబడుల కోసం వ్యాపారులను ఆశ్రయిస్తున్న అన్నదాతలు**

**యాసంగి లాగోడికి తీవ్ర ఇబ్బందులు**

# బంధు వొచ్చేనా !

## పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తున్న అన్నదాతలు

**'రైతు బంధు సాయాన్ని పెంచుతామన్న కాంగ్రెస్ ప్రభుత్వ ప్రకటనతో రైతాంగం సంతోషపడింది. సాయం పెంపు మాట దేవుడెరుగు.. గత కేసీఆర్ ప్రభుత్వంలో అందించిన సాయాన్ని అందించేందుకే కొత్త ప్రభుత్వం ఆపసోపాలు పడుతున్నది. గత ఏడాది డిసెంబర్‌లోనే యాసంగి సాగుకు రైతు బంధు సాయాన్ని అందించడం మొదలు పెట్టినప్పటికీ మూడు నెలలు కావొస్తున్నా.. ఇప్పటివరకు మూడు ఎకరాల్లోపు రైతులకే సాయం అందింది.**

రంగారెడ్డి, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ) : గత ప్రభుత్వ హయాంలో పెట్టుబడి సాయం అదునుకు అందేది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది.. పెట్టుబడి సాయం వెనుకబడింది. కాలం గడిచిపోతున్నదని ఆందోళన చెందుతున్న అన్నదాతలు పెట్టుబడుల కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. మరో నెల రోజుల్లో యాసంగి సీజన్ ముగియనుండడంతో ఇంకెప్పుడు రైతు బంధు సాయం అందుతుందని ఎదురుచూస్తున్నారు. చేతిల పైసలు లేక.. సాగు సాగక జిల్లా రైతాంగం కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది.

**అప్పల కోసం రైతుల వెంపర్లాట..**

యాసంగి సీజన్‌కు రైతు బంధు సాయం అందక రైతాంగం ఆందోళన చెందుతున్నది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అందించిన దానికంటే ఎకరాకు సంవత్సరానికి రూ.15వేల చొప్పున ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించినప్పటికీ అమలు చేయలేకపోయింది. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఇచ్చినట్లుగానే ఎకరాకు రూ.5వేల లెక్కనే సాయం అందిస్తున్నది. గత డిసెంబర్ 13 నుంచి సాయం పంపిణీ ప్రారంభమైనప్పటికీ అరకొర మందికి మాత్రమే సాయం వచ్చింది. రంగారెడ్డి జిల్లాలో ఈ యాసంగికి 4,04,436 మంది రైతులకు రూ.378.92కోట్ల సాయాన్ని అందించాల్సి ఉన్నది. ఇప్పటి వరకు 2,54,604 మంది రైతులకు రూ.147.33 కోట్లు వారి ఖాతాల్లో జమైనట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పటి వరకు మూడు ఎకరాలు ఉన్న రైతులకు మాత్రమే సాయం అందింది. దీంతో మిగతా రైతులకు ఎదురు చూపులే మిగిలాయి. గత కేసీఆర్ ప్రభుత్వంలో రైతు బంధు ప్రక్రియ సాయం వారం, పది రోజుల్లోనే పూర్తయ్యేది. కానీ.. కొత్త ప్రభుత్వంలో సీజన్ ముగిసిన తర్వాత కూడా సాయం డబ్బులు వస్తాయన్న నమ్మకం లేకుండా పోయిందని రైతాంగం వాపోతున్నది. పెట్టుబడులకు చేతిలో డబ్బులు లేక చాలా మంది రైతులు విధిలేని పరిస్థితుల్లో ఇప్పటికే వడ్డీ వ్యాపారుల వద్ద అప్పు చేశారు. మరికొంత మంది రైతులు సైతం అదే బాట పడుతున్నారు. ఎవుసం మళ్లీ ఆగమైతున్నదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**యాసంగి సాగుపై తీవ్ర ప్రభావం..**

రైతు బంధు సాయం అందకపోవడంతో ప్రస్తుత యాసంగి సాగుపై తీవ్ర ప్రభావం పడుతున్నది. జిల్లాలో ప్రస్తుత యాసంగిలో 80వేల ఎకరాల్లో పంటలు సాగవుతాయని జిల్లా వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇప్పటి వరకు వరి, మొక్క జొన్న, వేరు శనగ, ఆముదం, కుసుమలు, శనగలు వంటి పంటలు 41వేల ఎకరాల్లో సాగయ్యాయి. కొంతమంది వరి నార్లు పోసుకున్నారు. ఇంకా నెల రోజుల్లో సీజన్ ముగియనున్నది. ఓ వైపు వర్షాభావ పరిస్థితులు నెలకొని భూగర్భ జలాలు అడుగంటడం.. మరోవైపు పెట్టుబడి లేక సాగు చేసేందుకు రైతాంగం సాహసించడంలేదు.

### రైతుబంధు పైసలు రాలే..



కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినంక రైతుబంధు డబ్బులు రాలె. అదును దాటిపోయాక పైసలిస్తే.. తెచ్చిన అప్పులొల్లకు కూడా సరిపోవు.. ఈసారి ఎరువుల కొనేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. మళ్లీ ఎవుసం ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉన్నది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సమయానికి పెట్టుబడి సాయమిచ్చేది. దున్నకం, ఎరువులు, విత్తనాలు, కూలీలు అని ఖర్చేమో పెరిగిపాయే.. ఇప్పటికైనా రైతుబంధు డబ్బులు వేయాలె.

– జోగిరెడ్డి, నందివనపర్తి, యాచారం

### పెట్టుబడికి ఇబ్బందులు పడుతున్నాం..

కేసీఆర్ ప్రభుత్వం సమయానికి పెట్టుబడి సాయం ఇచ్చేది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కష్టాలు మొదలైనట్లు అనిపిస్తున్నది. అదును దాటవట్టే.. కాని రైతు బంధు రాకపాయే. రైతు బంధు డబ్బులు రేపొస్తయో.. ఎల్లుండొస్తయో.. ఎదురు చేసి విసుగు చెందిన.. ఇక రావని తేల్చుకుని అప్పు చేసి మూడు ఎకరాల్లో క్యాబేజీ, కాలీ ఫ్లవర్, బీట్‌రూట్ పంటలు సాగు చేశా. అనుకున్నంత ఫలితం రావడం లేదు. రైతులను మోసం చేసి గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం తప్పదు. ఇచ్చిన హామీలను నెరవేర్చి మాట నిలబెట్టుకోవాలి.



– సాలె నర్సింహులు, దేవునిఎర్రవల్లి (చేవెళ్ల రూరల్)

# నెగ్గేదెవరు..!

- మున్సిపల్‌లో బల పరీక్షకు ముంచుకొస్తున్న ముహూర్తం..
- గెలుపు కోసం ఎత్తులకు పైఎత్తులేస్తున్న బీఆర్ఎస్, కాంగ్రెస్..
- అవిశ్వాస తీర్మానంపై సంతకం పెట్టిన 17 మంది కౌన్సిలర్లు
- అందులో ఒకరిని తప్పించిన చైర్‌పర్సన్ వర్గం
- ఉత్కంఠగా మారిన ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్ అవిశ్వాస బలపరీక్ష





ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 11 : ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై బలపరీక్షకు ముహూర్తం దగ్గర పడుతున్నది. ఈనెల 16న అవిశ్వాసంపై బల పరీక్ష నిర్వహించేందుకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి నేతృత్వంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్, బీజేపీలకు చెందిన 17 మంది క్యాంపులకు వెళ్లారు. కాగా, క్యాంపులో ఉన్న ఖానాపూర్ కౌన్సిలర్ శంకరయ్య తన అత్త మృతి చెందడంతో ఆదివారం మంచాల మండలంలోని రంగాపూర్‌లో జరిగిన అంత్యక్రియలకు వెళ్లారు. విషయం తెలుసుకున్న చైర్‌పర్సన్ వర్గం శంకరయ్యను అక్కడి నుంచి తప్పించింది. దీంతో మున్సిపల్ చైర్‌పర్సన్ బలపరీక్ష ఉత్కంఠగా మారింది. ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్ బీఆర్ఎస్ నుంచి ఎంపికై గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆమె కాంగ్రెస్ పార్టీలో చేరక ముందే అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ.. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలకు చెందిన పలువురు కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. గతంలో అవిశ్వాస తీర్మానాలపై ప్రత్యేక సమావేశాలకు కలెక్టర్ అనుమతించకపోవడంతో రెండోసారి అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. దీనిపై ఈనెల 16న ప్రత్యేక సమావేశంలో బలపరీక్ష నిర్వహించాల్సి ఉన్నది. కాగా, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో మొత్తం 24 వార్డులు ఉన్నాయి. ఇందులో గత ఎన్నికల్లో 16 కౌన్సిలర్లు బీఆర్ఎస్, ఇద్దరు బీజేపీ, ఆరుగురు కాంగ్రెస్ కౌన్సిలర్లు గెలుపొందారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి కప్పరి స్రవంతిని చైర్‌పర్సన్‌గా ఎన్నుకున్నారు. చైర్‌పర్సన్, కౌన్సిలర్లను సంప్రదించకుండానే తీర్మానాలు చేస్తున్నారంటూ.. పలు అవినీతికి పాల్పడ్డారంటూ సొంత పార్టీ కౌన్సిలర్లు అవిశ్వాసానికి తెరలేపారు. ఈ నేపథ్యంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆమె కాంగ్రెస్ పార్టీలో చేరారు.

**ఆయా పార్టీల బలా.. బలాలు**

ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో మొత్తం 24 మంది కౌన్సిలర్లు ఉండగా, 15మంది బీఆర్ఎస్, ఇద్దరు బీజేపీ సభ్యులతో కలిసి 17 మంది మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. ఆమె వెంట ఏడుగురు కౌన్సిలర్లు ఉన్నారు. అవిశ్వాస తీర్మానంలో నెగ్గాలంటే అవసరమైన పూర్తి మెజార్టీ బీఆర్ఎస్‌కు ఉన్నది. కాగా, ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి ముగ్గురు సభ్యులు బీఆర్ఎస్‌లో చేరగా, బీఆర్ఎస్‌కు చెందిన మరో ముగ్గురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. బలపరీక్షలో నెగ్గేందుకు బీఆర్ఎస్ పార్టీ తమ అనుకూల వర్గం కౌన్సిలర్లతో గత నెలరోజులుగా క్యాంపులకు వెళ్లిపోయింది. బలపరీక్షలో నెగ్గకుండా ఉండటం కోసం కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నది. దీంతో ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్ బలపరీక్ష రసవత్తరంగా మరే అవకాశం ఉన్నది. ఆదిబట్ల మున్సిపల్ చైర్‌పర్సన్ బలపరీక్ష సమయంలో తలెత్తిన చదురు.. మదురు సంఘటనలు దృష్టిలో ఉంచుకుని ఈ పరిస్థితి ఇబ్రహీంపట్నంలో పునరావృతం కాకుండా పోలీసులు ముందు జాగ్రత్తగా గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మున్సిపల్ కార్యాలయం పరిసరాల్లో 144 సెక్షన్‌తో పాటు ఇతరులు ఎవరు అక్కడకు రాకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని పోలీసులు భావిస్తున్నారు.

**ఈనెల 22న ఉప్పరిగూడ చైర్మన్‌పై బలపరీక్ష..**

ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని ఉప్పరిగూడ సహకార సంఘం చైర్మన్ సుదర్శన్‌రెడ్డిపై పెట్టిన అవిశ్వాసానికి ఈనెల 22న బలపరీక్ష ప్రవేశపెట్టడానికి ముహూర్తం ఖరారైంది. చైర్మన్ సుదర్శన్‌రెడ్డి, వైస్ చైర్మన్ శంకర్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడుతూ.. కాంగ్రెస్, బీఆర్ఎస్ కౌన్సిలర్లు కలెక్టర్‌ను కలిశారు. దీనిపై ఈనెల 22న అవిశ్వాస తీర్మానంపై బల పరీక్షకు గడువు నిర్ణయించారు. కాగా, ఇప్పటికే డైరెక్టర్లు క్యాంపునకు వెళ్లారు. ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్, అలాగే, ఉప్పరిగూడ సహకార సంఘం చైర్మన్, వైస్ చైర్మన్లపై అవిశ్వాసాల నేపథ్యంలో డైరెక్టర్లు, కౌన్సిలర్లతో పాటు ఇతర ప్రజాప్రతినిధులంతా ఇరవై రోజులుగా క్యాంపుల్లో బిజీ...బిజీగా గడుపుతున్నారు.

## శంకరయ్య ఆచూకీ ఎక్కడ..

**పోలీస్ స్టేషన్‌కు చేరిన ఖానాపూర్ కౌన్సిలర్ పంచాయతీ..**

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 11 : ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం బలపరీక్ష నేపథ్యంలో ఖానాపూర్ కౌన్సిలర్ శంకరయ్య అదృశ్యమయ్యారు. ఈ మేరకు చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టినవారిలో శంకరయ్య కూడా ఉన్నారు. కాగా, శంకరయ్య గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి కౌన్సిలర్‌గా గెలుపొందారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఆయన బీఆర్ఎస్‌లో చేరారు. చైర్‌పర్సన్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంలో చైర్మన్‌కు వ్యతిరేకంగా ఉన్నారు. నెల రోజులుగా ఆయన చైర్‌పర్సన్‌కు వ్యతిరేక క్యాంపులో ఉన్నారు. శనివారం మంచాల మండలం రంగాపూర్ గ్రామంలో ఆయన అత్త మృతి చెందడంతో అంత్యక్రియల్లో పాల్గొనడానికి వెళ్లారు. ఇదే అదునుగా భావించిన చైర్‌పర్సన్ అనుకూల వర్గం వారు ఆయనను రంగాపూర్ నుంచి తీసుకెళ్లారు. ఆ వెంటనే ఆయన కుమారులు, కుటుంబ సభ్యులు మంచాల పోలీస్ స్టేషన్‌లో తమ తండ్రి శంకరయ్యను కిడ్నాప్ చేశారంటూ ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు రంగాపూర్, జాపాల, మంచాల తదితర ప్రాంతాల్లో సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలిస్తున్నారు. కాగా, శంకరయ్యను తాము కిడ్నాప్ చేయలేదని ఆయనే స్వచ్ఛందంగా వచ్చారంటూ చైర్‌పర్సన్ వర్గం చెబుతున్నది. ఈ నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమై దర్యాప్తు చేస్తున్నారు. చైర్‌పర్సన్ బలపరీక్ష ముహూర్తం దగ్గరపడిన నేపథ్యంలో కౌన్సిలర్‌ను తప్పించడం చర్చనీయాంశంగా మారింది.

**'ఇంటికి - వంద.. బడికి చందా' అన్న నినాదంతో విరాళాల సేకరణ**

# బడి మనదే..

# బడి బాగోగుల బాధ్యతా మనదే..

- ఘనంగా మజీద్‌పూర్ జిల్లా పరిషత్ ఉన్నత-ప్రాథమిక పాఠశాలలో 'బడి పండుగ'
- హాజరైన జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు
- అలరించిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు
- దాతలకు సర్టిఫికెట్లు అందజేసిన టీచర్ల బృందం



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 11 : ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచితే జిల్లాలోనే మజీద్‌పూర్ పాఠశాలలను ఆదర్శ పాఠశాలలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని రంగారెడ్డి జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు అన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మజీద్‌పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం రాత్రి నిర్వహించిన బడి పండుగ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జడ్పీటీసీ బింగి దేవదాస్‌గౌడ్, ఎంపీటీసీ మేడిపల్లి బాలమ్మ, తాజామాజీ సర్పంచ్ పోచంపల్లి సుధాకర్‌రెడ్డితో కలిసి పాఠశాలలో కంప్యూటర్ గది, సరస్వతీదేవి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈవో సుశీందర్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని మౌలిక వసతులు కల్పిస్తూ నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో ఇంత పెద్ద ఎత్తున బడి పండుగ నిర్వహిస్తారని ఊహించలేదన్నారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచితే జిల్లాలోనే ఆదర్శంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తానన్నారు. ఉద్యమంగా కదులుదాం.. ఊరిబడిని కాపాడుకుందాం.. బడి మనదే.. బడి బాగోగుల బాధ్యత కూడా మనదే.. అనే నినాదం, ఇంటికి – వంద.. బడికి చందా స్ఫూర్తితో గ్రామంలోని ఇంటింటా విరాళాలు సేకరించి ఊహించని రీతిలో గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం సంతోషకరమన్నారు. ఇంతటి కార్యక్రమ విజయవంతానికి కృషి చేసిన ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు, యువకులు, మహిళలు, విద్యాభిమానులు, దాతలను అభినందించారు. ఇదే స్ఫూర్తితో పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. అనంతరం దాతలకు సర్టిఫికెట్లను అందజేశారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని విశేషంగా ఆకట్టుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయభాస్కర్‌రెడ్డి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో మండల విద్యాధికారి వెంకట్‌రెడ్డి, వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకులు రవీంద్ర, మాజీ ఎంపీటీసీ కసరమోని లక్ష్మయ్య, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధవి, విద్యా కమిటీ చైర్‌పర్సన్ నందగిరి భాగ్యమ్మ, దాతలు మేడిపల్లి వెంకటేశ్‌గౌడ్, కక్కెర్ల జంగమయ్యగౌడ్, కాంటేకార్ రమేశ్, ఎడ్ల మహేందర్ ముదిరాజ్, గోపగోని శ్రీశైలంగౌడ్, ఐలయ్య, మేడిపల్లి బాల్‌రాజ్‌గౌడ్, పోచంపల్లి నరేందర్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావును సన్మానిస్తున్న మజీద్‌పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల టీచర్ల బృందం